## క్లుప్తంగా

### రుయాలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ చలపతి రెడ్డి

**తిరుపతి తుడా:** జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలను సోమవారం తిరుపతి రుయా ఆస్పత్రి కంటి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రుయాలో అవగాహన కల్పించి, రోగులకు కంటి పరీక్షలు చేశారు. రుయా కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతి రెడ్డి రోగులను ఉద్దేశించి మాట్లాడారు. నేత్రదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒక వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధ్రులకు కంటి చూపును ప్రసాదించవచ్చన్నారు. మరణాంతరం 8 గంటల వ్యవధి లోపు నేత్రాలను దానం చేయవచ్చన్నారు. నేత్రదానాన్ని కుటుంబ సంప్రదాయంగా మార్చుకోవాలని ఆయన హితువు పలికారు. కార్యక్రమంలో కంటి విభాగ వైద్యాధికారులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ,పీజీ వైద్య విద్యార్థులు, రోగులు, వారి సహాయకులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న చిరువ్యాపారుల నిరసన


టీటీడీ పరిపాలనా భవనం ఎదుట నిరసనలో పాల్గొన్న వివిధ వేషధారణలో చిన్నారులు

**తిరుపతి(అలిపిరి):** స్థానిక టీటీడీ పరిపాలనా భవనం ఎదుట శ్రీవారి మెట్టు మార్గంలోని చి రు వ్యాపారులు చేస్తున్న నిరసన దీక్ష 6వ రోజు కు చేరుకుంది. సోమవారం చిరు వ్యాపారుల పిల్లలచే శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వేషధారణలు చేయించి వినూత్న నిరసన తెలిపారు.

### ముగిసిన మాతమ్మ తిరుణాల


మాతమ్మకు పూజలు చేస్తున్న ప్రతాప్ స్వామిజీ

**రామచంద్రాపురం:** మండలంలోని పర మాల అరుంధతివాడలో సోమవారం మాతమ్మ తల్లి తిరుణాల వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ నేపథ్యంలో ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామిజీ తిరుణాలలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూ జలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### చెకుముకి సైన్స్ సంబరాలు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** జన విజ్ఞాన వేదిక(జేవీకే) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు–2024ను నిర్వహించనుందని జేవీకే నాయకులు రెడ్డప్ప, బిర్లానాయుడు తెలిపారు. తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్టును సెప్టెంబరు 25వ తేదీన, మండల స్థాయిలో అక్టోబరు 1న, జిల్లాస్థాయిలో అక్టోబరు 10వ తేదీన, రాష్ట్రస్థాయిలో నవంబరు 9, 10వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీకే నాయకులు లక్ష్మీ నారాయణ, యూటీఎఫ్ నాయకులు ముత్యాలరెడ్డి, నిర్మల, మురళి, బండి మధుసూదన్‌రెడ్డి, రవి, బాల తదితరులు పాల్గొన్నారు.

### భక్తుల సౌకర్యార్థం పనులు పూర్తి చేయాలి


వివిధ విభాగాల అధికారులతో సమీక్షిస్తున్న ఈఓ శ్యామలరావు

**తిరుపతి(అలిపిరి):** భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న వివిధ రకాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు సూచించారు. సోమవారం స్థానిక టీటీడీ పరిపాలన భవనంలోని తన కార్యాలయంలో టీటీడీలోని వివిధ విభాగాలపై అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి సమీక్షించారు. శ్రీవారి ఆలయం, ఇంజినీరింగ్ పనులు, రెవెన్యూ, పంచాయతీ, రిసెప్షన్, పారిశుద్ధ్యం, అన్నప్రసాదం విభాగాలతో ఈఓ సమీక్షించి పలు సూచనలు చేశారు. సమావేశంలో జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్ఓ శ్రీధర్, సీఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### స్పెషల్ ఫోర్స్ అవసరం



ప్రభుత్వ ఆస్పత్రిలోని అత్యవసర విభాగం వద్ద స్పెషల్ ఫోర్స్ ఏర్పాటు చేయాలి. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు వంటి కేసులు ఇక్కడికి వస్తుంటాయి. తమ వారిని బతికించుకోవాలన్న ఆవేశం, బాధ ఎక్కువగా ఉంటుంది. చికిత్స పొందుతున్న వ్యక్తిని చూసి ఎందుకు గుంపులుగా వచ్చేస్తుంటారు. ఈ క్రమంలో వైద్యులపై దాడులు జరిగే అవకాశం ఉంటుంది. ఎమర్జెన్సీ విభాగం వద్ద భద్రతను పటిష్టం చేయాలి. రోగి అటెండర్లను గుంపులుగా కాకుండా ఎంట్రీపాస్ విధానాన్ని అమలు చేసి ఒక్కొక్కరినే అనుమతించాలి.

– డాక్టర్ జ్యోతికుమార్, సీనియర్ వైద్యులు, తిరుపతి



### రాత్రి వేళల్లో గస్తీ ఉండాలి



ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణాల్లో రాత్రి గస్తీని బలోపేతం చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల పరిసరాలు అసాంఘిక కార్యక్రమాలకు అనువైన ప్రదేశాలుగా మారుతున్నాయి. వైద్య విద్యార్థులలో వసతి సముదాయాలకు వెళ్లే క్రమంలో మరింత సెక్యూరిటీ అవసరం. 36 గంటలపాటు కంటిన్యూ డ్యూటీ చేసే వైద్యులకు విశ్రాంతి గది, రెస్ట్ రూములను ఏర్పాటు చేయాలి. సాయంత్రం వేళలో ఇతరులను ఆస్పత్రి ప్రాంగణంలోకి అనుమతించకుండా చెకింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ రమ్య, గైనకాలజిస్టు, తిరుపతి

# కృష్ణం వందే జగద్గురుమ్..

- వైభవంగా జన్మాష్టమి వేడుకలు
- భక్తజనంతో పులకించిన ఇస్కాన్ మందిరం

**తిరుపతి కల్చరల్:** లోకరక్షకుడై జగన్నాథుడిగా భక్తజనావళి పూజలందుకుంటున్న శ్రీకృష్ణ భగవానుడి జన్మాష్టమి వేడుకలు సోమవారం జిల్లావ్యాప్తంగా అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఇస్కాన్ మందిరాలు, కృష్ణ మందిరాలలో శ్రీరాధాగోవిందులను భక్తజనం భక్తితో పూజించి పులకించారు. హరే కృష్ణ.. కృష్ణ కృష్ణ హరే.. నామస్మరణతో తిరుణామదారులైన భక్తులు భక్తి పారవశ్యంతో పరవశించారు. ఇందులో భాగంగా ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో వెలసిన ఇస్కాన్ మందిరంలో సోమవారం అత్యంత వేడుకగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉదయం 4.30 గంటలకు సమర్పించిన మంగళహారతి, తులసిపూజ, నరసింహ కీర్తన జపంతో వేడుకలు ఆరంభమయ్యాయి. అనంతరం మందిరంలోని వియత్నాం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన ఏనుగు బొమ్మలతో కూడిన మార్బుల్స్‌తో పీఠాన్ని ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్టింగ్స్‌పై శ్రీరాధాగోవిందులను ఆశీన్సులను చేశారు. రాధాగోవిందులను అష్టసఖులను విశేష పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు. శ్రీరాధా గోవిందులను దర్శించుకునే భక్తులకు ఆలయం వద్ద ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు, సెక్యూరిటీ సిబ్బంది సేవలను కల్పించారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు తండోపతండాలుగా ఇస్కాన్ మందిరానికి తరలివచ్చి శ్రీరాధా గోవిందులను దర్శించుకుని భక్తి పరవశంతో పులకించారు. వేలాదిమంది భక్తులు కమల మందిరంలోని శ్రీరాధాగోవిందులను దర్శించుకున్నారు. దీంతో ఇస్కాన్ రోడ్డు ఇస్కాన్ మందిరం భక్తులకు కిటకిటలాడింది. హరేకృష్ణ, హరేకృష్ణ నామస్మరణతో ఇస్కాన్ మందిరం మార్మోగింది. పిల్లలు వివిధ దేవతామూర్తుల వేషధారణలతో ఇస్కాన్ మందిరంలో సందడి చేస్తూ ఆకట్టుకున్నారు. భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు.

**వేడుకగా మహా శంఖాభిషేకం..**

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఇస్కాన్ మందిరంలో సోమవారం రాత్రి 11 గంటలకు శ్రీరాధాగోవిందుల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా మహా శంఖాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు పలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు.

**ఉత్సాహభరితంగా ఉట్లోత్సవం**

**తిరుపతి కల్చరల్:** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఇస్కాన్ మందిరం ఎదురుగానున్న టీటీడీ మైదానంలో సోమవారం సాయంత్రం ఉట్లోత్సవం ఉత్సాహభరితంగా సాగింది. జన్మాష్టమి నాడు సంప్రదాయబద్ధంగా యువత ఉట్లోత్సవం నిర్వహించారు. రంగు నీళ్లు చల్లుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. టీటీడీ క్వార్టర్స్‌కు చెందిన యువకులు ఉట్టి కొట్టి బహుమతి అందుకున్నారు.



అఖిల భారతీయ యాదవ మహాసభ ఆధ్వర్యంలో సూర్యప్రభ ఊరేగింపు, ఇస్కాన్ ఆలయం వద్ద రాధాగోవిందుల దర్శన నేపథ్యంలో భక్తుల రద్దీ

**చిన్నారుల సందడి..**

శ్రీకృష్ణ జన్మాష్టమి రోజైన సోమవారం చిన్నారులు చిన్నికృష్ణుడు, రాధ, యశోద వంటి వేషధారణలతో ఊరంతా సందడి చేశారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు చిన్నకృష్ణుడు, రాధా, యశోద, బలరాముడు వంటి వేషాలు ధరింపజేశారు. విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు కూడా కృష్ణుడు, యశోద, రాధ, బలరాముడు వంటి వేషాలతో జన్మాష్టమి వేడుకల సందడి చేశారు.

**పలు విద్యాసంస్థల్లో**

**తిరుపతి ఎడ్యుకేషన్ :** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం పురస్కరించుకుని నగరంలోని పలు విద్యాసంస్థల్లో శ్రీకృష్ణాష్టమి సంబరాలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని శ్రీనివాస ఇంగ్లిష్ మీడియం, కిరణ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో కృష్ణాష్టమి సంబరాలు జరుపుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

**పాకాలలో..**

**పాకాల :** మండలంలోని మొగరాల గ్రామంలో శ్రీజ మహిళా మిల్క్ ఉత్పత్తి కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళల ఆధ్వర్యంలో చిన్నారులకు కృష్ణుడు, రాధా గోపికల వేషధారణల వేయించి నృత్యాలు ప్రదర్శించారు. మహిళా పాడిరైతులకు పలు రకాల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌జీ నాజున్నిషా, సూపర్‌వైజర్లు నిరోష స్థానికులు పాల్గొన్నారు.

**చంద్రగిరిలో..**

**చంద్రగిరి:** మండల వ్యాప్తంగా శ్రీకృష్ణ మందిరాలు భక్తులతో కిక్కిరిశాయి. స్థానిక చంద్రగిరిలోని ద్వారకా నగర్‌లో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టి, అనంతరం స్వామివారికి హారతి, గోపూజ కార్యక్రమాలు చేపట్టారు. అలాగే కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మండల పరిధిలోని పనపాకం పంచాయతీ అరిగెలవారిపల్లిలో కృష్ణాష్టమి వేడుకలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్ స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, మాజీ ఎంపీటీసీ చెంగ్రాయులు తదితరులు పాల్గొన్నారు.


ద్వారకా నగర్‌లోని శ్రీకృష్ణ స్వామివారు


గోవులతో శ్రీకృష్ణుడు ప్రతిమ

**శిల్పారామంలో..**

**చంద్రగిరి(తిరుచానూరు) :** శిల్పారామంలో కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన మంజుల కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం అలరించింది. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొన్నారు.

**ఇందిరా మైదానంలో..**

**తిరుపతి కల్చరల్:** అఖిల భారతీయ యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఇందిరా మైదానంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సంబరాలు అత్యంత వేడుకగా నిర్వహించారు. ఇందిరా మైదానంలో ప్రత్యేకంగా మధుర మందిరం సెట్టింగ్స్‌ను నిర్మించారు. ఉదయం 7 గంటలకు గోపూజతో సంబరాలు మొదలయ్యాయి. సంప్రదాయబద్ధంగా మొదట దర్శనం సన్నిధి యాదవులకు కల్పించి, అనంతరం భక్తులకు శ్రీకృష్ణస్వామి దర్శనం కల్పించారు. తర్వాత 10 గంటలకు శ్రీగోవిందరాజ స్వామి ఆలయం నుంచి ఇందిరా మైదానం వరకు సూర్యప్రభ వాహనం ఊరేగింపు నిర్వహించారు. అఖిల భారతీయ యాదవ మహాసభ ప్రతినిధులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవులు, భక్తులు పాల్గొన్నారు.


ఆటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు




ఇందిరా మైదానంలో ఏర్పాటు చేసిన మధుర ఆలయ నమూనా, కిరణ్ పాఠశాలలో..., వాహన సేవలో భజనలు, నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

## తిరుపతి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి

**తిరుపతి తుడా:** కేంద్ర నిధుల కేటాయింపులో తిరుపతికి ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. మున్సిపల్, తుడాపై సమీక్షకు తుడా కార్యాలయానికి చేరిన మంత్రి నారాయణకు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమీక్షలో మంత్రితో పాటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. అమృత్ 2. లో తిరుపతి కార్పొరేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రిని కోరారు. అలాగే స్మార్ట్ సిటీ పనుల పూర్తికి రాష్ట్రవాటా రూ.209 కోట్లను విడుదల చేయించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేషన్‌లో నిధులు లేకపోవడంతో పాటు హోల్స్, వాటర్ పైపులైన్స్, డ్రైనేజీ వేసే పరిస్థితి లేదని వివరించారు. టీటీడీకి చెందిన పలు సంస్థలు తిరుపతిలో ఉన్నందున టీటీడీ, కార్పొరేషన్ సమన్వయంతో కొత్త ప్రాజెక్ట్స్ చేపట్టేలా చూడాలన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల కారణంగా స్థలం కోల్పోయిన నిజమైన బాధితులకు టీడీఆర్ బాండ్లు అందించాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ నెలన్నరలోపు పరిష్కరిస్తామని చెప్పారు.

## ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి

**తిరుపతి రూరల్:** దారి ఇవ్వమని హారన్ కొట్టినందుకు విధుల్లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన ఘటన ఆదివారం సాయంత్రం తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి నుంచి అడపారెడ్డిపల్లికి ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. దుర్గసముద్రం గ్రామం వద్ద దారిలో ఉన్నవారు పక్కకు వెళ్లమని చెప్పే క్రమంలో డ్రైవర్ జయరాం హారన్ కొట్టాడు. దీంతో అదే గ్రామానికి చెందిన ప్రసాద్, మణికంఠ కోపంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ జయరాం, కండక్టర్‌పై డ్యూటీలో ఉన్నారని కూడా చూడకుండా దాడి చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

## పర్యావరణ హితమైన విగ్రహాలనే వాడండి

- గణనాథుని నిమజ్జనానికి పక్కా ఏర్పాట్లు
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య

**తిరుపతి తుడా:** పర్యావరణ హితమైన వినాయక విగ్రహాలను ప్రజలు వినియోగించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆయన వినాయక నిమజ్జన ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, పోలీసు, నగరపాలక సంస్థ అధికారులు, వినాయక నిమజ్జన మహోత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. నిమజ్జనం జరిగే కుంటకు తెలుగుగంగ నీటి ట్రయల్ రన్ నిర్వహించి, కుంటను పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించారు. నిమజ్జనం సందర్భంగా వినాయక సాగర్‌కు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మండపాల వద్ద తగిన భద్రత కల్పించి, విగ్రహాలను తీసుకొచ్చే వాహనాలను వరుస క్రమంలో అనుమతించాలని పోలీసులకు సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పక్కగా చేసేలా అధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. మూడు రోజులు ముందుగానే కుంటను నీటితో నింపుతామని అన్నారు. మరుగుదొడ్లు కావాలని ప్రజలు అడిగారని, ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుని వినాయక చవితి వేడుకలు విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, డీఈలు విజయకుమార్ రెడ్డి, నరేంద్ర, డీఎస్పీలు వెంకటనారాయణ, రామకృష్ణ, సీఐ రామ్‌కిషోర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్ రెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తిరుపతి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వినాయక సాగర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్, కమిటీ సభ్యులు

### డ్వాక్రా బజార్ ప్రారంభం


డ్వాక్రా బజార్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకురాలు కోట దేవకి దేవి

**తిరుపతి కల్చరల్:** డ్వాక్రా మహిళా సంఘాల ఆధర్యంలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ బజార్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్ ద్వారా ఏర్పాటు చేశారు. మహిళలు మెచ్చే అన్ని రకాల గృహోపలంకరణలు, వస్త్రాలు, ఆట బొమ్మలు, చేతి వృత్తుల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. అంతేకాక పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు జాయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్ వంటివి ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను ప్రజలు తిలకించి మరింత ప్రోత్సహించాలని నిర్వాహకురాలు కోటదేవకి దేవి తెలిపారు.

## బస్సుల కండిషన్ బాధ్యత డ్రైవర్లదే

**తిరుపతి అర్బన్:** డిపోల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి... మేనేజర్లు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి డీఎంలకు సోమవారం ఆదేశించారు. తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి బస్టాండ్లలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచడంతో పాటు ఆర్టీసీ నిర్ణయించిన ధరలు మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి డిపోలోను తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రద్దీ సమయంలో బస్సులు ఎక్కడంలో ప్రయాణికులు క్యూ పద్ధతిని పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులతో కండక్టర్లు గౌరవంగా నడుచుకోవాలని తెలిపారు. తిరుపతితో పాటు జిల్లాలోని పలు పుణ్యక్షేత్రాలకు దేశ విదేశాల నుంచి భక్తులు వచ్చిపోతుంటారన్నారు. వారితో మర్యాదగా వ్యవహరించాలని వివరించారు. మరోవైపు ప్రయాణికులు కండక్టర్లతో చిల్లర విషయంలో సహకరించాలని కోరారు. ప్రతి డ్రైవర్ ప్రయాణం చేయడానికి ముందు బస్సు కండిషన్ చెక్ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. మరోవైపు గ్యారేజ్‌కి వచ్చే ప్రతి సర్వీస్‌ను నిశితంగా మెకానిక్స్ తనిఖీలు చేయాల్సి ఉందని చెప్పారు. సమష్టిగా పనిచేస్తేనే ప్రమాదాలకు దూరంగా ఉంటామని ముందే హెచ్చరించారు.

## యూపీఎస్ అమలుతో సంబరాలు


సీడీఓ కార్యాలయంలో సంబరాలు జరుపుకుంటున్న రైల్వే కార్మికులు

**తిరుపతి(అలిపిరి):** 2004 తర్వాత ఉద్యోగం పొందిన రైల్వే ఉద్యోగులందరికీ ప్రభుత్వం యూపీఎస్ అమలు చేస్తున్నట్లు ప్రకటించడంతో సోమవారం ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక సీడీఓ కార్యాలయం వద్ద కేక్ కోసి సంతోషం వ్యక్తం చేశారు. 2004 తరువాత ఉద్యోగం పొందిన ప్రతి ఒక్కరికి చివరి బేసిక్‌లో 50 శాతం పెన్షన్, కరువు భత్యం ఇస్తామని, అలాగే వైద్య సదుపాయం అందిస్తామని కేంద్ర కేబినెట్ ఆమోదించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ అధ్యక్షుడు కె.సుదర్శన్ రాజు, తిరుపతి బ్రాంచ్ అధ్యక్షులు నారాయణ స్వామి, తిరుపతి బ్రాంచ్ కార్యదర్శి రవీంద్ర నాయక్, కోశాధికారి మారయ్య, రోహిణి, జగదీష్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### వర్షం..అపార నష్టం



ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట కోత దశలో ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో రైతులకు అపార నష్టం మిగిలింది. శ్రీకాళహస్తి మండల పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి సుమారు 300 ఎకరాలు వరి పంట నేలకొరిగింది. మండలంలోని తొండమాన్‌పురం, అమ్మపాళెం, పుల్లారెడ్డి కండ్రిగ గ్రామాల్లో వరి పంట దెబ్బతినింది. అధికారులు స్పందించి పంట నష్ట పరిహారం పంపిణీ కి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. – శ్రీకాళహస్తి రూరల్